# "మాతృదేవో భవ, పితృదేవో భవ"

నిరత సత్య ప్రౌఢి ధరణి నేలిన హరి
శ్చంద్రుడీ ధర బాసి చనగలేదె
ఎల్ల లోకము లేలి ఎసగు శ్రీ నలరాజు
తన వెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబు నలంకృతిని చేయు మాంధాత
సిరి మూట గట్టుగ అరిగినాడె
జలధి సేతువు గట్టె అలనాటి శ్రీరాము
డుర్విపై యిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును వెంట గొనిపోరు ఉర్వితలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను

**తలను కట్టుకపోదువా ధర్మహృదయ!**

**మీ**రు మాత్రము మీ ఆస్తిని, బ్యాంకు బ్యాలెన్సును మూటగట్టుకొని పోగలరా! మానవుడు పుట్టినప్పుడు దేనినీ తనవెంట గొనిరాలేదు. అన్నీ మధ్యలో వచ్చి పోయేటటువంటివే! ఏవీ మీరు తెచ్చుకున్నవి కావు, మీతోపాటు పుట్టినవీ కావు. వస్తువులుగాని, ప్రోపర్టీగాని, బ్యాంకు బ్యాలెన్సుగాని ఏవీ మీవి కానప్పుడు అవి పోవునేమో అని వాటి నిమిత్తమై మీరు దుఃఖించడమెందుకు? భౌతికమైన, అనిత్యమైన, అశాశ్వతమైన వస్తువాహనాదుల నిమిత్తమై ఎందుకింత బాధ పడుతున్నారు? మీరు మానవులుగా పుట్టినది కంటిధారలు కార్చడానికి కాదు; పోవునప్పుడుకూడను మీరు ఆనందముగా పోవాలి.

srisathyasaivacharamrutam

**'కదలిపోయే మేఘముల'కోసం కంటిధారలు కార్చడం మానవుని లక్షణం కాదు**

వ్యష్టి, సమష్టి, సృష్టి, పరమేష్ఠి - ఈ నాల్గింటి మధ్యగల సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని గుర్తించడం మానవుని ప్రధాన కర్తవ్యం. వ్యష్టియే లేకుండిన సమష్టి లేదు. కాబట్టి, సమష్టికి వ్యష్టియే ప్రధానం. సృష్టిలో అంతర్భాగము సమష్టి. పరమేష్ఠి నుండి వచ్చినది సృష్టి. కనుక, సృష్టిలో అన్నియు భగవంతునియొక్క వరప్రసాదములే! కాని, మనం భగవంతుని నిమిత్తమై ఏమాత్రమైనా ప్రయత్నం చేస్తున్నామా? భగవంతుని నిమిత్తమై కంటిధారలు కారుస్తున్నామా? ఈ జగత్తులో అన్నీ వస్తాయి, పోతాయి. ఇటువంటి 'కదలిపోయే మేఘముల' కోసం కంటి ధారలు కార్చడం మానవుని లక్షణం కాదు. ఆకాశంలో మేఘాలు దట్టంగా క్రమ్ముకున్నప్పుడు సూర్యచంద్రులు మరుగైపోతారు. అంతమాత్రంచేత 'అయ్యో, సూర్యుడు కనిపించడం లేదే', 'చంద్రుడు కనిపించడం లేదే' అని మనం బాధపడ కూడదు. కొంచెం ఓపిక పట్టుకుంటే ఆ మేఘాలు కదలిపోతాయి; సూర్యుణ్ని, లేక చంద్రుణ్ని మళ్ళీ చూడవచ్చును. మానవునికి ముఖ్యంగా కావలసింది సహనము.

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నెగాంచినయట్టి**
**/ ఘన సత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావముకన్న మాన్యమెద్ది**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మనదేశ నీతిని మంటగలిపి**
**నేటికిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔర ఏమందు భారత పాలనంబు!**

sri sathyasaivachanamrutam

**ఏనుగెట్టుల తన బల మెరుగలేదొ**
**అట్టులైనారు మన భారతీయులు నేడు!**

మానవుడు మహా శక్తిమంతుడు. మానవునికి ఉన్నటువంటి శక్తి మరెవ్వరికినీ లేదు. అందుకోసమనే దైవంకూడను మానవాకారముతో అవతరిస్తున్నాడు. 'దైవం మానుష రూపేణ'. దైవముకంటే మించినటువంటిది మరొకటి లేదు. అట్టి దైవాన్ని మరచిపోవడం మహాద్రోహం. క్షణక్షణమూ మనం దైవాన్ని స్మరిస్తూ ఉండాలి. మనం చేసే పనులు వేరువేరుగా ఉండవచ్చును. కాని, పనులు ఏవి చేసినప్పటికీ పరతత్వాన్ని మాత్రం మరువకూడదు. అదే నిజమైన మానవత్వము. కాని, ఈనాడు మనం దైవత్వాన్ని మరచిపోతున్నాము. అందుకోసమే జగత్తునందు ఇన్నిరకములైన బాధలు సంభవిస్తున్నాయి. ఈ బాధలకు మూలకారణం మీ భ్రమలే! మీరు అనుభవించే కష్ట, నష్టములు భగవంతుడు ప్రసాదించినవి కావు. భగవంతుడు ఎప్పుడుకూడను సుఖ, సంతోషములనే అందిస్తాడు. కాని, మీ భ్రమలచేత మీరు వాటిని కష్టములుగా భావించుకొని బాధపడుతున్నారు. ఈ బాధకు మూలకారణం మీ భావములే! మీ భావములను దైవత్వంతో నింపుకున్నప్పుడు మీకు ఎట్టి బాధలూ ఉండవు.

ఈనాడు మీలో కొందరు (ఆటల పోటీల్లో పాల్గొన్న వివిధ టీమ్‌ల కెప్టెన్లు) నల్లని కోట్లు, తెల్లని షర్ట్స్ వేసుకొని ఇక్కడ ప్రత్యక్షమయ్యారు. మీరందరూ వేసుకొన్నారే అని మన అనిల్ కుమార్ కూడను 'బ్లాక్ కోటు' వేసుకొని వచ్చాడు. ఇట్టి అనుకరణయే ఈనాడు ప్రపంచమంతా వ్యాపించి ఉన్నది. ఇది మంచిది కాదు. ఇది కేవలం తాత్కాలికమైన ఆనందాన్ని అందిస్తుంది.

**ఏది వచ్చినా 'ఇది నా మంచికోసమే' అనుకుంటే దుఃఖమునకు అవకాశమే లేదు**

ఎవరైనా సరే, మహారాజైనా, చక్రవర్తియైనా పోయే సమయంలో ఒక గరికపోచైనా తీసికొని పోలేరు. అయితే, మనం ఉన్నంతవరకు వీటిని అనుభవించ వలసిందే! తరువాత వీటికీ, మనకూ ఎట్టి సంబంధమూ లేదు. ఈ సంబంధ బాంధవ్యములన్నీ మనం

sri sathyasai vahini vachanamrutam

పుట్టించుకున్నవే! ఇలాంటి కల్పితమైన విషయాలను అనుసరించకూడదు. వివాహము కాక ముందు నీకున్నవి రెండు కాళ్ళే! భార్య వస్తూనే నాలుగు కాళ్ళవుతాయి! బిడ్డ పుడుతూనే ఆరు కాళ్ళవుతాయి! ఈవిధంగా కాళ్ళు పెరుగుతూ పోయేకొలదీ దుఃఖముకూడను పెరుగుతూ వస్తుంది. ఇవన్నీ నీయొక్క పిచ్చి సంకల్పముచేత నీకై నీవు పెంచుకున్నవేకాని భగవంతుడు ఇచ్చినవి కావు. అయితే, ఏది చిక్కినా, ఏది వచ్చినా 'ఇది నామంచి కోసమే' అనుకున్నప్పుడు దుఃఖమునకు అవకాశమే లేదు. మనం ఉన్నంతవరకు సుఖాన్ని పొందాలి. సంతోషంగా జీవించాలి. సంతోషమే మనయొక్క జీవితము.

**దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుందు గణుతింపగ దేహికి చావు పుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా**
**దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ**

పుట్టినవారిని చూసి ఆనందిస్తున్నావు, గిట్టినవారికోసం దుఃఖిస్తున్నావు. కాని, నీవసలు దుఃఖానికి అవకాశమే అందించకూడదు. నిజమైన ఆనందము నీ హృదయంలోనే ఉన్నది. దానిని నీవు ఆవిర్భవింపజేసుకోవాలి. ఎట్టి బాధలు సంభవించినా, "నేను దైవాంశమును, నేను కంటిధారలు కార్చను" అని నీవు ధైర్యంగా వాటిని ఎదుర్కోవాలి.

**"శ్రేయో హి జ్ఞాన మభ్యాసాత్ జ్ఞానా ధ్యానం విశిష్యతే**
**ధ్యానా త్కర్మఫలత్యాగ స్త్యాగా చ్ఛాన్తి రనన్తరమ్"**

కర్మఫలత్యాగము చేయాలి. అదే నిజమైన జీవితము. ఫలాపేక్ష ఉండినంతవరకు మనకు బాధలు తప్పవు.

**ఈ జగత్తునందు ప్రతి ఒక్కటీ కల్పితమైనది, దేనికీ మనము విచారించకూడదు**

ఈ 'స్పోర్ట్స్ మీట్'లో కార్యక్రమాలన్నీ ఎవరు చేశారు? మీరే చేశారు. ఇవన్నీ మీనుంచి జరిగినవేగాని ఇంకెవరో కొత్తగా పుట్టించినవి కావు. ఇవి మీకు ఎంతో ఆనందాన్ని అందించాయి. కనుక, మీరు పుట్టించుకున్నదే మీకు ఆనందాన్ని అందిస్తుంది, లేక బాధను కలిగిస్తుంది. ఈ జగత్తునందు ప్రతి ఒక్కటీ కల్పితమైనది. ఎంతవరకు మనము ఇక్కడ

srisathyasaivachanamrutam

ఉండగలము? ఏదో కొంతకాలమే! మనము చేయవలసిన కార్యము జరిగేంతవరకు మాత్రమే ఇక్కడ ఉండగలము. తదుపరి దీనిని వదలిపెట్టి పోక తప్పదు. ఈ సత్యాన్ని మనము గుర్తించి వర్తించడము అత్యవసరము. ఈ జగత్తునందు ఏదీ శాశ్వతము కాదు. గతించినవారికోసమై మనం చింతించనక్కర్లేదు, పుట్టినవారికోసమై ఆనందించ నక్కర్లేదు. ఈనాడు పుట్టింది రేపు ఏమవుతుందో ఎవరూ చెప్పలేరు. నిన్నటి దినము, ఈనాడు, రేపటి దినము – ఈ మూడింటినీ నీవు ఏకంగానే భావించాలి. భూత, భవిష్యత్, వర్తమానములు మూడూ ఒక్కటే. కాని, మన అనుభవాలు మాత్రం వేర్వేరుగా రూపొందుతున్నాయి. వాటిని ఏమాత్రం మనలో చేర్చుకోకూడదు. గతించిన కాలము తిరిగి రాదు (Past is past). భవిష్యత్తు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. కాబట్టి, Present (వర్తమానము) మనకు ప్రధానమైనది. ఇది 'ఆర్డినరీ ప్రెజెంటు' (Ordinary present) కాదు, 'ఆమ్నీ ప్రెజెంటు' (Omnipresent). ఎందుకంటే, ఇందులో 'పాస్ట్' (గతించిన కాలము) ఉంది; 'ఫ్యూచర్' (భవిష్యత్తు) ఉంది. కనుక, మనము ఈ మూడింటినీ ఏకంగా భావించి ఆనందాన్ని అనుభవించాలి.

విద్యార్థులారా! మీరు అనుభవించునవన్నీకూడను అసత్యములే! కదలిపోయే మేఘాలే! అన్నీకూడను వస్తున్నాయి, పోతున్నాయి. వీటి నిమిత్తమై మీరు విచారించనక్కర్లేదు. మనము ముందుకు నడిచి వచ్చిన తరువాత తిరిగి వెనక్కి ఎందుకు చూడాలి? ముందుకు వచ్చేటప్పుడు అవి చూసే వచ్చాము కదా! కనుక, మనము జగత్తునందు దేనికీ విచారించకూడదు. కొంతమంది చదువు విషయంలో బాధపడుతుంటారు; సంసారవిషయమునందుకూడా బాధ పడుతుంటారు. కొంతమంది స్త్రీలు గతించిన తమ పతిని తలుచుకొని, 'ఆయన అప్పుడు ఉండినారే, ఇప్పుడు లేరే!' అని బాధపడుతుంటారు. అయితే, అప్పుడు ఇప్పుడు ఎప్పుడుకూడను ఉన్నవాడు భగవంతుడు ఒక్కడే! మధ్యలో మారిపోయే 'వేషాలను' చూసి అదే సత్యమని మనము భ్రమిస్తున్నాము. అది కేవలం మన యొక్క 'ఇమేజినేషనే'! ఈ 'ఇమేజినేషన్'ను దూరం చేసికొని ఏకత్వాన్ని అనుభవించాలి. ఇది క్రొత్త సంవత్సరమని మనము భావిస్తున్నాము. అయితే, ఈ 'న్యూ ఇయర్' ఎక్కడినుండి వచ్చింది? 'ఓల్డ్' (పాతది) లేకుండా 'న్యూ' (క్రొత్తది) రాలేదు. పాతదే క్రొత్తదవుతుంది,

srisathyasaivachanamrutam

క్రొత్తది పాతదవుతుంది. కనుక, 'ఓల్డ్ అండ్ న్యూ' రెండూ బింబ ప్రతిబింబములే! ఈ జగత్తులో మీరు దేనికీ విచారించకూడదు. దుఃఖముగాని, విచారముగాని, కష్టములుగాని ఉంటే వాటిని దూరం నెట్టేయండి. 'అయ్యో, ఎగ్జామినేషన్లు వస్తున్నాయి. ఏమవుతుందో' అని మీరు భయపడనక్కర్లేదు. మీరు ఎంతవరకు చదివారో అంతవరకు వ్రాయగలరు. ధైర్యంగా మీరు వ్రాయాలి. "ధైర్యం సర్వ సాధకం." దాన్ని వదలితిరా, అన్నీ శూన్యమైపోతాయి. కనుక, మీరెల్లప్పుడు ధైర్యాన్ని విడనాడకుండా ఉండాలి. దీనినే 'పుష్టి' అనికూడా అన్నారు. ఈ పుష్టియే సర్వసృష్టికి ఆధారమైయున్నది. మీయందున్న కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములే బయట ప్రతిబింబిస్తున్నాయి. బయట ప్రతిబింబించేవన్నికూడను మీలోపల ఉన్నటు వంటివే! కాబట్టి, మీ అంతరంగమును పరిశుద్ధంగా పెట్టుకోండి. అప్పుడే మీరు అన్నిటియందు విజయాన్ని సాధించగలరు. మీ అంతరంగమునందున్నటువంటి దివ్యత్వాన్ని విస్మరించి బాహ్యమైన విషయాలకోసం ప్రాకులాడడం చాలా తప్పు.

**ఇంద్రియ నిగ్రహంద్వారా ఇంద్రియ శక్తిని అభివృద్ధి పరచుకోవాలి**

ప్రేమస్వరూపులారా! విద్యార్థులారా! మీరెన్నియో చదువులు చదువుతున్నారు. కాని, మీ అంతరంగము పరిశుద్ధంగా లేకపోతే ఎన్ని చదువులు చదివినాగాని ఏమి ప్రయోజనం? "చదువులన్నియు చదివి చాల వివేకియై మదిని తన్నెరుగడు మందమతుడు." తన నిజతత్త్వమును తాను తెలుసుకోకుండా మానవుడు ఎన్ని చదువులు చదివితే ఏమి ప్రయోజనం? "చదువులన్నియు చదివి చావంగనేటికి? చావులేని చదువు చదువవలయు." మీ చదువులు సమాజానికి ఉపయోగపడాలి. మీరు చదివిన చదువును పదిమందికి అందించాలి. చదువు రానటువంటివారికి మీరు చదువు నేర్పాలి. అప్పుడే మీ మానవత్వము విశాలమవుతుంది. వ్యష్టి అంటే ఒకటే. కాని, దాని ప్రక్కన రెండవది చేరిందంటే, అది సమష్టి అవుతుంది. వ్యష్టి సమష్టితో ఏకం కావాలి.

'సెన్స్ కంట్రోలు' (ఇంద్రియ నిగ్రహం) ద్వారా మీరు ఇంద్రియ శక్తిని అభివృద్ధిపరచుకోవాలి. 'సెన్స్ కంట్రోలు' ఉన్నప్పుడే మీరు నిజమైన వ్యక్తులుగా

sri sathyasai vachanamrutam

జీవించగలరు. కాని, ఈనాడు 'సెన్స్ కంట్రోలు' అనేది ఎక్కడా కనిపించడం లేదు. ఇంద్రియాలను విచ్చలవిడిగా వదలిపెడుతున్నారు. కేవలం చదువునందు మాత్రమే కాదు, ప్రవర్తనయందుకూడను మనం ఆదర్శాన్ని నిరూపించాలి. అందునిమిత్తం మన ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలి. భగవంతుడు మనకు ఇంద్రియాల నిచ్చినది వాటిని సద్వినియోగ పరచుకొని పుష్టిని, సంతుష్టిని పొందడానికేగాని, సృష్టిని మన ఇష్టానుసారం అనుభవించడానికి కాదు. ఈనాటి మానవుడు అనుభవించే ఇంద్రియ సుఖాలను క్రిమికీటకాదులుకూడను అనుభవిస్తూనే ఉన్నవి. చీమలకుకూడను పిల్లలు పుడుతున్నాయి. అవికూడా తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నాయి. కనుక, మనము తిండితీర్థాదులకోసం బాధపడనక్కర్లేదు. ఎవరు మనలను సృష్టించారో ఆ భగవంతుడే మనలను పోషించగలడన్న విశ్వాసాన్ని కలిగి యుండాలి.

**నిజమైన విద్య మన మస్తకంలోనే ఉన్నదిగాని పుస్తకంలో లేదు**

కొంతమంది ఎక్కువ జీతం వస్తుందని విదేశాలకు వెళుతున్నారు. అక్కడ నెలకు ఐదు వేల డాలర్లు సంపాదించవచ్చు. ఇండియన్ కరెన్సీతో పోల్చుకుంటే అది ఎన్నో లక్షలవుతుంది. కాని, అక్కడ ఎంత ఆదాయమో అంత నష్టము. అక్కడ ఐదు వేల డాలర్లు సంపాదించే బదులు ఇక్కడ ఐదు నూర్లు సంపాదించినా చాలు మనకు. ఈ సత్యాన్ని గుర్తించుకొనలేక అనేకమంది అనేకరకములైన ఆశలు పెంచుకొని abroad (విదేశాలకు) పోతున్నారు. కాని, abroad లో ఏముంది? Broadness (విశాలమైన భావము) మీలోనే ఉన్నది. దానిని వదలిపెట్టి మీరు abroad పోవడం చాలా పొరపాటు. మీరు విదేశాలకు పోనక్కర్లేదు. ఇక్కడే ఉండి, మీ తల్లిదండ్రులను సేవించండి. మీ బిడ్డలకు భారతీయ సంస్కృతిని బోధించండి. అదియే నిజమైన విద్య. "చదివి వ్రాయ నేర్చినవారందరూ విద్యావంతులేనా? సుజ్ఞానము, సుకృతము లేని విద్యలు సద్విద్యలగునా?" కాదు, కాదు. సుజ్ఞానము, సుకృతము లేకపోతే 'ఎడ్యుకేషన్' అంతా నిరర్థకమే! టీచర్లు కేవలం పుస్తకాల్లో ఉన్న విషయాలను బోధిస్తారు. కాని, నిజమైన విద్య మన మస్తకంలోనే ఉన్నదిగాని పుస్తకంలో లేదు.

srisathyasaivachanamrutam

కనుక, విద్యార్థులారా! మీరు ఊరకే చదివి చదివి కాలమును వ్యర్థం చేయకండి. కొందరు విద్యార్థులు 'డే అండ్ నైట్' నిద్రపోకుండా చదువుతుంటారు. దీనివల్ల ఆరోగ్యముకూడను పాడైపోతుంది. ఎప్పుడు చదవాలో అప్పుడు చదవాలి. ఏది అవసరమో దానిని చదవాలి. అనేకమంది పిల్లలు అవసరం లేనివాటినంతా చదివి కాలమును వ్యర్థం చేస్తున్నారు. ఎక్కడ ఏ పుస్తకం చిక్కితే ఆ పుస్తకాన్ని చదువుతుంటారు. బజార్లో క్రిందపడి ఉన్న న్యూస్ పేపర్లనుకూడా తీసుకుంటారు. సినిమా బొమ్మలు చూస్తుంటారు, సినిమా స్టోరీలు చదువుతుంటారు. మీ అందరికీ తెలుసు – న్యూస్ పేపర్లను తెరిచి చూస్తే అంతా అడ్వర్‌టైజ్‌మెంట్లు, సినిమా బొమ్మలు – ఇవి తప్ప మనము వాటినుండి నేర్చుకొనేది ఏమీ లేదు. ఈ తుచ్ఛమైన పేపర్లను చదివి మానవుడు తన గౌరవ మర్యాదలను కోల్పోతున్నాడు. ఇది కాదు మనం చదువవలసిన చదువు.

నిజమైన విద్య అంతర్వాణినుండి ఆవిర్భవిస్తుంది. మొట్టమొదట మీ మస్తకములో ఉన్న మాలిన్యాన్ని తొలగించుకొని, మీ అంతర్వాణి ప్రబోధను 'ఫాలో' చేయండి. మీ 'కాన్షియన్స్' (అంతర్వాణి)ని మీరు అనుసరించినప్పుడే నిజమైన మానవులుగా జీవించగలుగుతారు. కేవలం కాళ్ళు, చేతులు, కన్నులు, ముక్కు, నోరు ఇవన్నీ ఉన్నంతమాత్రమున మీరు మనుష్యులు కారు. చిన్నచిన్న పురుగులకుకూడను కాళ్ళు, చేతులు, కన్నులు మొదలైన అన్ని అంగములూ ఉన్నాయి. అయితే, మీరుకూడా వాటి మాదిరిగా జీవితాన్ని గడుపవచ్చునా? కాదు, కాదు. మీరు ఆదర్శం అందించాలి. 'ఇది మనిషియొక్క నిజమైన స్వరూపము. ఇది నిజమైన 'కల్చర్' (సంస్కృతి)' అని నిరూపించాలి. మన సంస్కృతినే మనము ఆదర్శంగా తీసుకోవాలి.

**ఉన్నది ఒకే కులం, అదే మానవ కులం**

'కల్చర్'తో పాటు మీ 'కాస్ట్' (కులం)కూడా మీరు దృష్టిలో పెట్టుకోవాలి. ఏది మీ కులం? ఉన్నది ఒకే కులం, అదే మానవ కులం (Caste of humanity). 'కల్చర్'కు, 'కాస్ట్'కు మధ్య ఉన్న వ్యత్యాసమేమిటి? 'ఇది ఎట్లా చేయాలి? ఏమి చేయాలి? ఇది మంచిదా? చెడ్డదా?' అనేది 'కల్చర్' నేర్పుతుంది. 'కాస్ట్' అనేది మాత్రం మీరు పుట్టినప్పటినుండి మీతో వచ్చేటటువంటిది. మీరు మానవులు. ఇదే మీ 'కాస్ట్'. దాన్ని ఎవ్వరూ మార్చడానికి



srisathyasaivachanamrutam

వీలుకాదు. ఈ సత్యాన్ని మీ హృదయంలో పెట్టుకొని మీరు 'కల్చర్'ను అనుసరించాలి. కాని, మీరు ఏది చేయకూడదో అది చేస్తున్నారు. 'కాస్ట్' & 'కల్చర్' – ఈ రెండిటినీ అనుసరించినప్పటికీ మీలో 'డిస్క్రిమినేషన్ పవర్' (విచక్షణాశక్తి) లేకపోతే ప్రయోజనం లేదు. మీ తెలివితేటలు, బుద్ధికుశలత ముఖ్యం కాదు; 'డిస్క్రిమినేషన్' చాలా అవసరం. చీకటిలో ఉన్నప్పుడు మనం లైటు వేసుకోవాలి. అంతేకాని, వెలుతురు ఉండగా లైటు వేసుకోవడం వివేకవంతుల లక్షణం కాదు. కనుక, ఏది మనకు అవసరమో దానిని తీసికొని సరియైన స్థితిలో జీవించాలి.

విద్యార్థులారా! మీరు ముఖ్యంగా నేర్చుకోవలసినది, 'బుకిష్ నాలెడ్జి' కాదు; పెంచుకోవలసినది భౌతికమైన 'ఎనర్జీ' కాదు. ఈ రెండూ వస్తూ పోతూ ఉంటాయి. ఎప్పటికీ ఉండే 'డిస్క్రిమినేషన్'ను మీరు అభివృద్ధిపరచుకోవాలి. మీరు ఏది చూసినా, "ఇది మంచిదా? చెడ్డదా? ఇది ఉపయోగకరమా? కాదా?" అని మొట్టమొదట యోచన చేయాలి. ఏ పనైనా చేయడానికి ముందు "ఈ పని నేను చేయవచ్చునా? చేయకూడదా?" అని యోచించాలి. ఈవిధముగా మానవత్వాన్ని పెంచుకుంటూ రావాలి.

**అందరికంటే తల్లిదండ్రులే ముఖ్యం**

మనలను కని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులను బాధపెట్టకూడదు. వేదము చెప్పింది, 'మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ" అందరికంటే తల్లిదండ్రులే ముఖ్యము. కాని, ఈనాటి పిల్లలకు తల్లీ అక్కర్లేదు, తండ్రీ అక్కర్లేదు; మధ్యలో వచ్చినటువంటి భార్యనే వారికి ముఖ్యం; ఆమెనే వాళ్ళు అనుసరిస్తారు. నవమాసములు మోసి, కష్ట నష్టములను ఓర్చుకొని కని పెంచి పెద్ద చేసినటువంటి తల్లిదండ్రులను మరచిపోతున్నారు. నీ భార్యను నీవు ప్రేమించు. కాని, నీ వినయ విధేయతలను మాత్రం నీ తల్లిదండ్రులకు చూపించు. తల్లిదండ్రుల తరువాతనే మిగితా అందరూ. వేదము బోధిస్తున్నట్లుగా మొట్టమొదట మీ తల్లిని మీరు ప్రేమించండి. ఆమె ఆజ్ఞను శిరసావహించండి. తల్లిని సంతోషపెట్టినప్పుడే మీ జీవితం సంతోషకరంగా సాగుతుంది. తల్లి కంటిధారలు కార్చెనా, మీరు జీవితమంతా బాధపడవలసి వస్తుంది. మీరు మీ తల్లిని ఏవిధంగా సంతోషపెడతారో భవిష్యత్తులో మీ జీవితంకూడా అంత సంతోషకరంగా

sri sathyasai vahini vachanamrutam

సాగుతుంది. కాని, ఈనాడు తల్లి ప్రేమను గుర్తించి నటువంటివారు చాలా తక్కువగా ఉన్నారు. తల్లి ఏమైనా చెబితే, 'నోర్మూసుకో. నాకన్నీ తెలుసు. నువ్వు చెప్పనక్కర్లేదు, నేను ఇన్ని డిగ్రీలు తీసుకున్నాను. నాకు ఇంతమాత్రం తెలియదా?" అంటారు. మీరు ఎన్ని డిగ్రీలైనా తీసుకోవచ్చును. ఏదో ఒక సబ్జెక్టులో మాత్రం మీకు డిగ్రీ వచ్చి ఉంటుంది. కాని, జనరల్ జీవితానికి సంబంధించిన డిగ్రీ మీకు ఎక్కడ వచ్చింది! అది మీకు తల్లిదండ్రులే నేర్పాలి. ఎంత గొప్ప డిగ్రీ పొందినప్పటికీ మొట్టమొదట మీరు మీ తల్లికి సేవ చేయాలి. తల్లికి తగిన ఆనందాన్ని అందించాలి. అప్పుడే మీ జీవితం 'హ్యాపీ'గా ఉంటుంది. మీరు నిత్య జీవితంలో నేర్చుకోవలసినది నేర్చుకోవాలి, చేయవలసినది చక్కగా చేయాలి. ఈ సందేశమే ఈనాడు నేను మీకు అందించే గొప్ప బహుమతి.

**"హరి భజన బినా సుఖ శాంతి నహీ"**

నిజంగా భజన వింటుంటే ఎంత శాంతిగా ఉంటుంది! మనము పద్యాలు, పాటలు ఎన్ని పాడినా అవి అంత ఆనందాన్ని అందించవు. కాబట్టి, భజన ఒక్కటి ప్రధానంగా పెట్టుకోవాలి. భజనలో అందరూ చేరడంవల్ల సమష్టి తత్త్వం అలవడుతుంది. ముందు మనం నేర్చుకోవలసింది అదే! నువ్వు పాడాలి, నీతోటివారిని నీతో కలుపుకోవాలి. అప్పుడే నీకు శాంతి చిక్కుతుంది. "హరి భజన బినా సుఖ శాంతి నహీ", కనుక, భజనే ముఖ్యము. బయట పాడడానికి నీకు సిగ్గయితే నీలో నీవు పాడుకో! కాని, ఈనాడు కొందరు ఇంతమాత్రం కూడా చేయడం లేదు. ఇది మంచిది కాదు. దేనినైనా మరువవచ్చుగాని దైవచింతనను మాత్రం మరువకూడదు. లౌకికమైనవన్నీ వస్తున్నాయి, పోతున్నాయి. కాని, భజన అనేది వచ్చి పోయేది కాదు. అది శాశ్వతమైనది. కనుక, మీరు దైవచింతన మాత్రం ఎప్పటికీ మరువకండి.

**– తేదీ 15.01.2008 మకర సంక్రాంతి, బహుమతి ప్రదానోత్సవం, సాయికుల్వంత్ సభామండపం**

sri sathyasaivacharamrutam